
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 11 ఏప్రిల్ 2024

నెమలి వాహనంపై స్వామివారల విహారం 7లో..

7లో.. రాజన్న హుండీ ఆదాయం రూ. కోటి 27 లక్షలు

మిడ్ మానేరు వెలవెల



- డెడ్‌స్టోరేజీకి దగ్గరలో ప్రాజెక్ట్
- 27.55 టీఎంసీల సామర్థ్యం
- డెడ్‌స్టోరేజ్ 6.27 టీఎంసీలు
- ప్రస్తుత నీటి నిలువ 7.02 టీఎంసీలు
- మరో ప్రాజెక్ట్ అన్నపూర్ణది అదే పరిస్థితి
- జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- ధాన్యం దిగుబడిపై అన్నదాతల ఆందోళన
- జిల్లాలో 11.81 మీటర్ల లోతులోకి జలాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో ప్రాజెక్టులు వెలవెల బోతున్నాయి. డెడ్‌స్టోరేజీకి దగ్గరలో ఉండడం ఆందోళనకు గురి చేస్తోంది. కాళేశ్వరం పథకం ఎత్తిపోతల్లో భాగమైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు జల వారధిగా నిలిచిన జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ జలకళ కోల్పోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల మానేరువాగు, వేములవాడ మూలవాగుల్లో 18 కిలోమీటర్ల మేరకు బ్యాక్ వాటర్‌తో కళకళాడిన మిడ్ మానేరు ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గిపోయి వెలవెలబోతోంది. 27.55 టీఎంసీల నీటి సామర్థ్యానికి ప్రస్తుతం 7.02 టీఎంసీల నీటి నిల్వకు పడిపోయింది. దీంతో జిల్లాలోని మిషన్‌భగీరథ గ్రిడ్ నుంచి సరఫరా చేసే మంచినీటికి కూడా కష్టాలు ఏర్పడనున్నాయి. ఇప్పటికే నీటి శుద్ధికి అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. మిడ్ మానేరులో 3.8 టీఎంసీల వరకు రుద్రవరంలోని ఇంటేక్‌వెల్ అప్రోచ్ కాలువకు నీరందుతుంది. అంతకంటే నీటి మట్టం తగ్గిపోతే నీటి శుద్ధి చేయడం కష్టమే కాకుండా సరఫరా



నెర్రెలు బారిన పొలం

కూడా చేసే వీలు ఉండదు. ఇప్పటికే నీరు తగ్గిపోవడంతో రంగు మారిన నీరు వస్తోంది. ఈ పరిస్థితులు ఇలా ఉండగా జిల్లాలో భూగర్భ జలాలు కూడా వేగంగా పడిపోతున్నాయి. మార్చిలో సరాసరి జిల్లాలో 11.81 మీటర్లకు నీటి మట్టం పడిపోయింది. ప్రతి నెలా మీటర్లలోనే జనవరిలో 8.70 మీ టర్ల లోతులో నీళ్లు ఉండగా ఫిబ్రవరిలో 10.18 మీటర్లలో నీళ్లు ఉన్నాయి. 1.63 మీటర్ల లోతులోకి నీళ్లు పడిపోయాయి. జిల్లాలో లోలోతుల్లోకి భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండడంతో ఆందోళనలు ఏర్పడ్డాయి.

● ఎండుతున్న పంటలు

జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోవడం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు ఉండని పరిస్థితుల్లో బోరుబావుల్లోనూ నీటి నిల్వలు తగ్గిపోయాయి. పొలాలకు నీళ్లందని పరిస్థితి ఏర్పడింది. యాసంగి పంటలకు ఎండిపోతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో వరి కోతలు మొదలైనా నెర్రలు బారిన పొలాలతో దిగుబడి కష్టంగా మారింది. జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.73 లక్షల ఎకరాల్లో వరి వేసుకున్న రైతులు దిగుబడి రాక ఆవేదన చెందుతున్నారు. మరోవైపు చివరి క్షణంలో పంటను దక్కించుకోవడానికి మళ్లీబోరు బావులు, బావుల్లో పూడికలు తీస్తున్నారు. పంట చేతికి రాదని అనుకున్న రైతులు పశువులకు మేతగా వదిలివేస్తున్నారు. ఒకవైపు వరికోతలు, మొదలు కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సారి పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెట్టుకున్నా దిగుబడి రాకపోవడంతో లక్ష్యం నేరవేరే పరిస్థితులు కనిపించడం లేదు.

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిన తీరు (మీటర్లలో)

మండలం	మార్చి 2023	మార్చి 2024	తగ్గుదల
బోయినపల్లి	7.00	7.52	- 0.52
చందుర్తి	6.60	8.46	- 1.87
గంభీరావుపేట	8.49	10.70	- 1.71
ఇల్లంతకుంట	5.94	9.00	- 3.06
కోనరావుపేట	9.78	11.41	- 1.63
ముస్తాబాద్	11.83	13.48	- 1.65
రుద్రంగి	7.96	9.19	- 1.23
సిరిసిల్ల	11.10	13.19	- 2. 09
తంగళ్లపల్లి	9.82	10.37	- 0.55
వీర్నపల్లి	21.67	26.84	- 5.17
వేములవాడ రూరల్	4.93	6.07	- 1.14
వేములవాడ అర్బన్	15.44	15.20	0.24
ఎల్లారెడ్డిపేట	12.15	16.68	- 4.54
జిల్లా సరాసరి	**9.64**	**11.81**	**- 2.16**

రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, ఏప్రిల్ 10: రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ విప్ ఆది శీనివాస్ సమక్షంలో సింగిల్ విండో డైరెక్టర్ కేసిరెడ్డి నర్సరెడ్డి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఛైర్మన్ కోమిరె శంకర్, వైస్‌ఛైర్మన్ దసారి గంగారాజం, మాజీ ఎంపీటీసీ మోతె నర్సయ్య, పోగుల నర్సయ్య, అల్లూరి లచ్చిరెడ్డి, నర్సయ్య, సంతోష్, రాజిరెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి విప్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, నాయకులు తర్రె మనోహర్, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, గడ్డం స్వామి, తర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 10: బాల్య వివాహాలను అరికట్టాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లోగల మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సు నిండకముందే వివాహాలు చేసుకుంటే సంతానంపై ప్రభావం చూపుతుందన్నారు. ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. బాలికలు వేధింపులకు గురైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలిపాలని సూచించారు. పోక్సో చట్టం ద్వారా చర్యలు తీసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కృషిచేయాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.. మైనర్లు డ్రైవింగ్ చేయవద్దని, డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్న తర్వాతనే వాహనాలను నడపాలని లేకంటే తల్లిదండ్రులు ఇబ్బందుల పాలు కావాల్సి వస్తుందన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసేవాఅధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే న్యాయసేవాధికారికి దరఖాస్తు ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్ అరుణ, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, పర్శరాములు, కుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రంజాన్.. ఈద్గాల ముస్తాబు

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ధార్మిక చింతన, త్యాగం, దాతృత్వం, క్రమశిక్షణ మార్గంలో నడిపే ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం రంజాన్‌లో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టారు. రంజాన్ మాసంలో మహ్మద్ ప్రవక్త హితవుల ప్రకారం ముస్లింలు నడుచుకుంటూ ఖురాన్ పారాయణంతో చేపట్టిన ఉపవా స దీక్షలను బుధవారంతో ముగిసిపోయాయి. గురువారం రంజాన్ వేడుకల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈద్గాలు, మజీద్‌లను ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాభయ్యాయి. 30 రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉన్న నెలవంక దర్శనం అనంతరం ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకుంటారు. రంజాన్ రోజున ఈద్గాల వద్ద సామూహికంగా నమాజ్‌లు చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. చిన్నాపెద్ద తేడా లేకుండా నమాజ్‌లను చదువుతారు. పండుగ రోజు పేదలకు దానాలు చేస్తారు. ఉపవాస దీక్షలే కాకుండా దీక్ష పాటించే వారు అబద్ధం ఆడకుండా ఇతరును నిందించకుండా శారీరక, మానసిక వాంచలకు దూరంగా నిగ్రహంతో ఉంటూ దైవ చింతనతో గడుపుతారు. ప్రతి రోజు ఐదు సార్లు నమాజ్ చేస్తారు. స్వీయ క్రమశిక్షణతో ఉన్న ముస్లింలు దీక్షలను విరమించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 10: సాగునీరు లేక పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధ్యమానేరులో నీరు ఉన్నప్పటికిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సార్యం చేసిందన్నారు. దీనితో పెద్దలింగాపూర్, అనంతగిరి, రహీంఖాన్‌పేట తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కించపర్చేలా పోస్టింగులు పెట్టవద్దు

- ఎస్ఐ రాజుగౌడ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 10: సోషల్‌మీడియాలో ఇతరులను కించపర్చేలా పోస్టింగులు పెట్టవద్దని ఎస్సై రాజు గౌడ్ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో నియమావళి అమలులో ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు సైతం నిబంధనలు పాటించాలని, ఎవరైన అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైన జరిగితే పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. సమస్యలు ఉంటే మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా పోలీస్‌స్టేషనుకు రావాలని సూచించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దంపతులు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని 20 నిరుపేద ముస్లిం కుటుంబాలకు గొల్లపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మహ్మద్ లాలా సమకూర్చిన నిత్యావసర సరుకులను ఆయన మిత్రులు నరేశ్, రామస్వామి బుధవారం అందజేశారు. పండుగ పూట పస్తులు ఉండకూడదని లాలా సరుకులు సమకూర్చారని పేర్కొన్నారు. ఆయనకు నిరుపేద ముస్లిం కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులను పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 10: తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వేసవికాలం పూర్తి చేసుకోని వర్షాలు వచ్చేవరకు తాగు నీటి సరఫరా అంశంపై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు, నీటి పునరుద్ధరణ వివరాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకమైన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో వచ్చే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి రెగ్యులర్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గురించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. వానాకాలం 2023-24కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీని వేగవంతం చేయాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ధరపై కొంటామని, ధాన్యం కొనుగోలు అంశంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత రైతుకు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతీ మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను నియమించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు అవసరమైన నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు. వడ గాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీఓ వీరబుచ్చయ్య, డీఆర్డీఓ శేషాద్రి, డీఈవో రమేష్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల రక్షణకే షీటీమ్‌లు

- నెలరోజుల్లో తొమ్మిది కేసులు నమోదు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 10: మహిళలు, బాలికల రక్షణకే షీటీమ్‌లు పనిచేస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో నెల రోజులుగా షీటీమ్ బృందాలు అవగాహన సదస్సులు నిర్వహించిన సందర్భంగా ఎస్పీ బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో షీటీమ్‌కు వచ్చిన ఫిర్యాదులపై తొమ్మిది కేసులు నమోదు చేశామని, ఇందులో ఐదు ఎఫ్ఐఆర్‌లు, నాలుగు పెట్టికేసులు పెట్టామన్నారు. మహిళలను, విద్యార్థులను వేధించిన వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. జిల్లాలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనపుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదుచేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రద్దీ ప్రదేశాల్లో షీటీమ్ బృందాలు మఫ్టీలో నిఘా ఉంటాయన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమ్యలు వచ్చినా నిర్భయంగా



పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణ విషయంలో పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుంచి మహిళల రక్షణ కోసం పోలీస్‌శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోటోలు, వీడియోలను పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అకతాయిలు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, యువతులు ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే నేరుగా షీటీమ్ నంబర్ 8712656425ను లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు


వీర్నపల్లి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2017-18 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. విద్యార్థులందరూ కలిసి పాఠశాలకు రెండు సౌండ్ బాక్స్‌లను వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతన్నలకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: సిరిసిల్లలో ఉన్న నేతన్నల కోసం గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని త్వరగా పూర్తిచేసి కార్మికులను యజమానులు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వాసాల రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదంతోనే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకున్నాయని అన్నారు. గత ప్రభుత్వం తయారు చేయించిన బతుకమ్మ చీరలకు సంబంధించి బకాయిలతోపాటు కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీలను అందించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభాన్ని పట్టించుకోకపోవడంతోపాటు బకాయిలను విడుదల చేయకపోవడంతో నేతన్నలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి కష్టాలతో పాటు కార్మికుల అత్మహత్యలు చూసి చలించిపోయిన ఎంపీ బండిసంజయ్ కుమార్ సిరిసిల్లలో నేతన్నలకు భరోసా ఇచ్చేందుకు దీక్ష చేస్తామని ప్రకటించడంతో రాష్ట్రప్రభుత్వం స్పందించి వస్త్ర పరిశ్రమల సమస్యలను పరిష్కారిస్తామని, పెండింగ్ బకాయిలతోపాటు యారన్ సబ్సిడీలను అందించడంతోపాటు నేతన్నలకు నిరంతరం ఉపాధిని కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, విప్ అది శ్రీనివాస్ ప్రకటించడం హర్షణీయమన్నారు. సమావేశంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, వేముల సురేష్, అంకారపు రాజు, వేముల రజనీకాంత్, గాజుల సదానందం, రచ్చ రాహుల్, గుడ్ల విష్ణు, మోర రవి, మంచికట్ల భాస్కర్, మోర శ్రీహరి, ఉరగొండ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాసాల రమేష్



పిచ్చి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో హన్‌మాన్‌నగర్, మెయిన్ రోడ్‌పై బుధవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. దారి వెంట వెళ్లే వారిపై పిచ్చి కుక్కలు దాడికి తెగబడ్డాయి. ఎక్క డ పడితే అక్కడ దాడి చేస్తూ గాయపర్చడంతో భయంతో పరుగులు తీశారు. హన్‌మాన్‌నగర్‌లో నలుగురిపై, మెయిన్‌రోడ్‌పై మరో నలుగురుపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. అబ్దుల్లా, ఆరీఫ్, షాదుల్, అజ్నాన్‌తో పాటు మరో నలుగురిని పిచ్చి కుక్కలు గాయపర్చాయి. గాయ పడ్డ వారిలో నలుగురు మహిళలు ఉన్నారు. వీరందరిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.



భూఆక్రమణ కేసులో ధరణి మాజీ కో ఆర్డినేటర్ బుచ్చిరాజు అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న కరీంనగర్ కలెక్టరేట్‌లో ధరణి మాజీ కోఆర్డినేటర్ భగత్‌నగర్‌కు చెందిన ఎల్లంకి బుచ్చిరాజును కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌లో నకిలీ ధ్రువపత్రాలతో భూ ఆక్రమణకు పాల్పడినట్లు బాధితుడు బొంతల రఘు ఫిర్యాదుతో కొత్తపల్లి ఠాణాలో ఇదివరకే మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో సహా 12 మందిపై కేసు నమోదైంది. కాగా అప్పుడు తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మిగతా 9 మందిలో ఏ12 నిందితుడిగా ఉన్న ఎల్లంకి బుచ్చిరాజును బుధవారం అరెస్టు చేశారు. బుచ్చిరాజు గతంలో కలెక్టరేట్‌లో ధరణి కో ఆర్డినేటర్‌గా పనిచేశాడని, తహసీల్దార్‌కు సహకరించాడని సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వీర్నపల్లి, ఏప్రిల్ 10: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు ఎక్కడున్నా పట్టేస్తున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో పెద్దమ్మ ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన బొజ్జ కనకరాజు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పరిజ్ఞానంతో పోలీసులు పట్టుకున్నారు. ఫోన్‌ను బుధవారం ఏఎస్ఐ రాజిరెడ్డి బాధితుడికి అందజేశారు.


ఎండవేడికి చెరువులోని చేపలు మృతి


వేములవాడ రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని మర్రిపల్లిలోని చెరువులో ఎండ వేడిమిని తట్టుకోలేక చేపలు మృతి చెంది బుధవారం ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. చెరువును ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటేష్ కుమార్, కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము, రేగుల మల్లికార్జున్, రేగుల రాజేశం, మర్రిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పండుగ మల్లేశం, సభ్యులు పరిశీలించారు.











టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు, సీనియర్ న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్, హ్యూమన్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియామకం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ న్యాయవాది, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్‌కు పదవి రావటంపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు తన శక్తివంచ లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావటంలో కీలకంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్
- అల్లీపూర్ గురుకుల పాఠశాలలో విచారణ

రాయికల్, ఏప్రిల్ 10: గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గురుకుల పాఠశాలల రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ మహాత్మ బాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన విద్యార్థుల ఘర్షణపై గురుకుల పాఠశాలల కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ బుధవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో గౌతమ్ మాట్లాడుతూ గురుకులంలో చదివే విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటారని, బాత్‌రూమ్‌కు వెళ్లే సందర్భంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో విద్యార్థి గాయపడినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థి పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలియజేయక పోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆశ్రయించి ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఉగాది సందర్భంగా సెలవు కావడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు దశలవారీగా విధులు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థి గాయపడిన విషయం ఉపాధ్యాయులకు తెలుపకపోవడం వల్లే తల్లిదండ్రులు ఆగ్రహించారన్నారు. ఈ ఘటనలో విద్యార్థిపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించామని, పద్ధతి మార్చుకోకపోతే రానున్న అకాడమిక్ సంవత్సరంలో వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సెలవు దినాల్లో ఒకరికి అదనంగా మరొక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందివ్వడంతో పాటు వైద్యులకు సంప్రదించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

మెడికల్ కళాశాల నిర్మాణాలను

అడ్డుకున్న రైతులు

- నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్
- రైతులపై దాడి చేసిన కాంట్రాక్టర్
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- ఫిర్యాదు చేసిన రైతులు


కళాశాల భవన నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: నష్ట పరిహారం ఇవ్వకుండానే నమ్మించి మోసం చేసి మెడికల్ కళాశాలను నిర్మించారని నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టాలంటూ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మెడికల్ కళాశాల వద్ద పనులను మూడు రోజుల నుంచి రైతులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కాంట్రాక్టర్ దగ్గరుండి పనులు చేయిస్తుండగా విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో కాంట్రాక్టర్ ఆవేశానికి లోనై రైతులపై దాడి చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దూరు శివారులోని సర్వే నంబర్ 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో అప్పటి ప్రభుత్వం 40 మంది నిరుపేద రైతులకు జీవనోపాధి కోసం అందించాయి.

జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో అప్పటి మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి రైతులకు సమాచారం ఇవ్వకుండానే 36 ఎకరాల స్థలాన్ని కళాశాలకు కేటాయించారు. దీంతో తమ భూములను తీసుకోవద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో రైతులతో కేటీఆర్ మాట్లాడి నష్టపరిహారంతో పాటు వాణిజ్య, వ్యాపారానికి సంబంధించిన భూములలో మనిషికి 800 గజాల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి కళాశాలను అఘమేఘాల మీద నిర్మించారు. కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని తీర్మానం చేసుకొని మూడు నెలల నుంచి పనులను అడ్డుకుంటూ వస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి రాగా రైతులు అడ్డుకున్నారు.

దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని అప్పటి ఆర్డీవోను ఆదేశించగా ఆర్డీవో ఆ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టపరిహారంతో పాటు స్థలాలు ఇస్తామంటూ సర్వేయర్‌తో సర్వే చేయించి వదిలేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అప్పటి ఆర్డీవో బదిలీపై వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆర్డీవో వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో పాటు సోమవారం కాంట్రాక్టర్ తిరిగి పనులను ప్రారంభించగా రైతులు పనుల ను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం అందించడంతో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల సమస్యలు విన్న సీఐ రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం రాలేదని విషయం తెలుసుకోని రైతులను పంపించి వేశారు. దీనిలో భాగంగానే బుధవారం తిరిగి పనులను చేస్తుండగా రైతులు అడ్డుకొని పనులను నిలిపివేయించడంతో పాటు రిలే నిరహారదీక్షలు కూడా చేస్తామంటూ ఆందోళన చేపట్టారు. సాయంత్రం కాంట్రాక్టర్ మెడికల్ కళాశాల పనుల వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్నా రైతులపై దాడి చేయడంతో రైతులు ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

నష్ట పరిహారం కోసం న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్న తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 10: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై స్వామివారల విహారం


నెమలి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో పార్వతీ రాజ రాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు నెమలి వాహనం పై విహరించారు. రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం పార్వతి రాజరాజేశ్వరస్వామి, సీతా రామచంద్రస్వామి వారలకు పూజలు నిర్వహించారు. రాత్రి పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: రేషన్ బియ్యం అక్రమంగా రైస్‌మిల్‌కు తరలించిన కేసులో నిందితులైన గోపాల్‌పూర్ రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య, రైస్‌మిల్ యజమాని మొగసాల సంతోష్‌రెడ్డి, ఆటో యజమాని, డ్రైవర్ ఊరడి మధులను బుధవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ రేషన్ డీలర్ అంజయ్య పేదలకు పంపిణీ కోసం వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని దుర్శేడ్‌లోని శ్రీ వెంకటేశ్వర మినీ రైస్‌మిల్‌కు తరలించి విక్రయించే యత్నంలో సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచి, రూరల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీనిపై మంగళవారం కేసు నమోదు కాగా నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డిపేట శివారులోని సంచార జీవుల గుడిసెలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనపర్చుకున్నామని పోలీసులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో గుడిసెలో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గుడిసెలో నివసిస్తున్న వ్యక్తులు పారిపోయారని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 13 మంది వాహనదారులను బుధవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఇద్దరు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 4,500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. మిగతా 11 మంది వాహనదారులకు 21 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సికింద్రాబాద్‌లో యువకుడి ఆత్మహత్య


సాయితేజ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలం దుమాల గ్రామానికి చెందిన సాయితేజ (19) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సికింద్రాబాద్‌లో అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని పాముల వనిత-సంతోష్ గౌడ్‌కు ముగ్గురు కొడుకులు బన్నీ, సాయితేజ, అరవింద్ ఉన్నారు. సంతోష్ గౌడ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సంతోష్‌గౌడ్ పదేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వనిత తన ముగ్గురు పిల్లలతో కలిసి ఉపాధి నిమిత్తం యేడాది కిందట సికింద్రాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సాయితేజ మానసికంగా ఆరోగ్య పరిస్థితి బాగలేక పోవడం వల్ల అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచా రం అందుకున్న అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

తల్లితో కలిసి ఉండడం నచ్చకే పినతండ్రి హత్య


హంతకుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మల్లాపూర్, ఏప్రిల్, 10: తల్లితో కలిసి పినతండ్రి అంబదాస్ ఉండటం నచ్చక కోపంతో తనయుడు కందెం రవితేజ హత్య చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హంతకుడు రవితేజను మల్లాపూర్ నంది విగ్రహం నుంచి వెళ్తుండగా అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. మల్లాపూర్ దుర్గమ్మకాలనీకి చెందిన అంబదాస్ (54) తన రెండో భార్య అయిన భోజమ్మతో పాటు ఆమె కుమారుడు కందెం రవితేజతో కలిసి పదిహేనేళ్ల నుంచి నివాసం ఉంటున్నారన్నారు. రవితేజ చిన్నతనంలోనే తండ్రి రమేష్ మరణించగా భోజమ్మ కుమారుడు రవితేజతో కలిసి అంబాదాస్‌తో మల్లాపూర్‌లోని దుర్గమ్మ కాలనీలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తన తల్లి భోజమ్మ సంపాదించిన డబ్బులను అంబదాస్ వాడుకుంటున్నాడని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. రవితేజ పని చేయకుండా జల్సాగా తిరుగుతుండగా పినతండ్రి అయిన అంబదాస్ మందలించేవాడని ఇలా చాలా రోజు నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. అప్పటి నుంచి జల్సాలకు అడ్డుగా ఉన్నాడని భావించి అంబాదాస్‌ను చంపాలని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. దీంతో రవితేజ స్నేహితుడి ఇంటికి వెళ్లి మామిడి కాయలు కొట్టడానికి కత్తి అవసరం ఉందని తెచ్చుకొని శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడుకొని ఉన్న అంబుదాస్‌పై కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోగా అంబుదాస్ అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమారలు పరిశీలించి కేసు నమోదు చేసుకొని రవితేజను రిమాండ్ తరలిస్తున్నట్లు తెలిపారు.

కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి జరిగే చిన్నహను మాన్ జయంతి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. కొండపైన ఆలయ పరిసరాలు, కోనేరు, మాల విరమణ, క్యూలైన్‌లు ఎస్పీ పరిశీలించారు. వందలాది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం, ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఏఈ లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రాజన్న హుండీ ఆదాయం కోటి 27 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా కోటి 27 లక్షల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. 15 రోజుల వ్యవధిలో భక్తులు స్వామి వారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కోటి 27 లక్షల 78 వేల 950 రూపాయల నగదు, 90 గ్రాముల బంగారం, తొమ్మిది కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఉద్యోగులు, శివ రామ కృష్ణ భజనమండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మణిదీప్ (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 10: ప్రేమించిన యువతితో ఏర్పడిన మనస్పర్థలతో విడిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రామన్నపేటకు చెందిన వకుళాభరణం మణిదీప్ (31) ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మరింది. వారి ప్రేమలో మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెందిన మణిదీప్ గత ఫిబ్రవరిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మళ్లీ మంగళవారం రాత్రి ఇంట్లోని వంట గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


నజీర్ (ఫైల్)

ముస్తాబాద్, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లలో నివాసముంటున్న ఎండీ నజీర్ (42) ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఎండీ నజీర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ అనా రోగ్య కారణంతో ఉండలేక తిరిగి వచ్చాడు. తాగుడుకు బానిసైన నజీర్ ఆర్థికస్థితి బాగాలేక మనస్తాపంతో గత నెల 24వ తేదీన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం పంపించారు. చికిత్స పొందుతూ నజీర్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి బిజాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన రాజు(49) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలం గట్టుపై ఉన్న గడ్డికోస్తుండగా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ఉంది. చూసుకోకుండా అటువైపు వెళ్లి గడ్డి కోసిన రాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన లింగారెడ్డి

కోరుట్ల రూరల్, మార్చి 10: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి లింగా రెడ్డి (70) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లింగా రెడ్డి కొన్ని రోజులుగా షుగర్‌తో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చికిత్సలో లింగారెడ్డి కాలు వేలును వైద్యులు తొలగించారు. అప్పడి నుంచి నిత్యం లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్‌లో ఉదయం ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించి నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకుని పరిశీలన జరిపారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 10: మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు నుంచి దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వైపు వెళ్తున్న కారు బుధవారం అదుపు తప్పి సమీపంలోని పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్లకు చెందిన వేణు అతని కుమారునికి గాయాలైనట్లు తెలిసింది. గాయాలపాలైన వారిని పోలీసులు చికిత్స నిమ్మిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులకు రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చెరువులో పడి వన్యప్రాణి మృతి


నీటిలో మృతి చెందిన మనుబోతు

వీర్నపల్లి, ఏప్రిల్ 10: చెరువులో పడి వన్యప్రాణి మృతిచెందిన సంఘటన మండలంలోని రంగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామశివారులోని ఆటవీ ప్రాంతం నుంచి మార్గండి చెరువులో నీరు తాగడానికి వచ్చిన మనుబోతు అందులో పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ సెక్షన్ అధికారి పద్మలత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన మనుబోతు కళేబరాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పశుసంవర్ధక సిబ్బందితో పంచనామా నిర్వహించి కళేబరాన్ని దహనం చేశారు.

ఆన్‌లైన్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- డీఈవో రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: వివిధ ఉద్యోగాలతోపాటు ఉపాధ్యాయ, టెట్ పరీక్షలకు పోటీ పడుతున్న నిరుద్యోగ అభ్యర్థులు అన్‌లైన్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల జిల్లా గ్రంథాలయంలో బుధవారం విన్నర్స్ పబ్లికేషన్ అధినేత, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో సుమారు రూ 50వేల విలువైన వివిధ ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో రమేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షలను నిరుద్యోగులు అశ్రద్ధ చేయకుండా ఉద్యోగాలను సాధించేలా పరీక్షలు రాసి ఉద్యోగాలను సాధించాలంటే అన్‌లైన్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి బుగ్గారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు సత్కారం



రాణీప్రసాద్‌ను సత్కరిస్తున్న హరికృష్ణ

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా క్రోధి నామ సంవత్సర వేడుకలు మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, ఉగాది వేడుకల్లో సిరిసిల్లకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ ప్రత్యేక అహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాణీప్రసాద్‌కు సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికష్ణ ఉగాది పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. కవి సమ్మేళనంలో రాణీప్రసాద్‌తన కవితను వినిపించి అందరిని అలరించారు. అర్థంకానీ వ్యాకరణం పేరుతో వినిపించిన కవిత అందరిని ఆకట్టుకుంది.

అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు

- ఎస్పీ అఖిల్ మహాజన్



హోంగార్డుకు రూ.10వేలు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 10: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు లక్ష్మికి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికి ఘనంగా సత్కరించి హోంగార్డు సంక్షేమ నిధి నుంచి 10వేల రూపాయలను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 28ఏళ్లు విధులు నిర్వహించి అందరి మన్ననలను పొందడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో చేసిన సేవను మరువలేమని ఎలాంటి సమస్య వచ్చినా వచ్చి సంప్రదిస్తే చేయూతనందిస్తామన్నారు. పదవీ విరమణ అనేది కేవలం వృత్తికేనని, వ్యక్తిత్వానికి కాదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆహ్వానం



ఆది శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలంలోని నారాయణపూర్‌లోని సీతారామచంద్రాస్వామి ఆలయంలో నిర్వహించనున్న స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరు కావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం వేములవాడలోని ఆయన కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయ దత్తత ఆలయమైన నారాయణపూర్‌లోని సీతారామచంద్రాస్వామి గుడిలో కల్యాణోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలకు హాజరు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ సర్పంచ్ నర్సయ్య, నాయకులు తిరుపతి, కిషన్, లక్ష్మారెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా బాలకిషన్

ముస్తాబాద్, ఏప్రిల్ 10: ముస్తాబాద్ పట్టణ పద్మాశాలి సంఘం అధ్యక్షుడిగా తడుక బాలకిషన్ ఐదోసారి ఏకగీవ్రంగా నియమాకమయ్యారు. స్థానిక మార్కండేయ ఆలయంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా తాటిపాముల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా గౌడ మల్లేశం, ఎనగందుల శంకరవ్వ, ప్రధాన కార్యదర్శిగా దొంత బాలరాజ్, కోశాధికారిగా గౌడ కృష్ణహరి, కార్యవర్గ సభ్యులుగా గౌడ సహదేవ్, మెర్గు భూమేశ్, మారెల్లి శ్రీనివాస్, దొంత శ్రీనివాస్, తడుక ప్రభాకర్, బిట్ల సంతోష్, గౌడ అరుణ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా తడుక లక్ష్మీనారాయణ, బిట్ల వజ్రానందం, దండె రామకృష్ణ, మండలి లక్ష్మీరాజం, పుట్ట వైకుంఠంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఏప్రిల్ 10: మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్ఐ రాంమోహన్ సూచించారు. గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో బుధవారం పోలీస్‌లు మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మత్తుపదార్థాలపై సమచారం ఇవ్వాలని, అనుమానితులు ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. నమ్మదగిన సమాచారం ఉంటే 100 డయిల్ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, సిబ్బంది ఉన్నారు.

వస్త్ర పరిశ్రమను ఆదుకుంటామని సీఎం హామీ ఇవ్వాలి

- కార్మిక కుటుంబాన్ని కేటీఆర్ ఓదార్చడం శవరాజకీయమా..? - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వానికి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆగయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్లలో శవరాజకీయాలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలను ఖండించారు. సిరిసిల్లలో నాలుగు నెలలుగా వస్త్ర పరిశ్రమ కుంటుపడి పూట గడవక అప్పులతో కార్మికులు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో ఒక కార్మికుడు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఓదార్చడం ధైర్యం చెప్పడం శవరాజకీయం అవుతుందా అన్ని ప్రశ్నించారు. ఎంపీగా ఉన్న బండి సంజయ్ వస్త్ర పరిశ్రమకు ఎలాంటి సహాయం చేయకున్న కార్మికుడి చనిపోతే శవరాజకీయాలు చేశాడని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నేత కార్మికులను ఓదార్చడం పోయి శవరాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి హోదాలో వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు తెలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లకు రావచ్చు కాని మీరు ఇచ్చిన హామీలు ఎంత వరకు వస్త్ర పరిశ్రమకు ధైర్యం ఇచ్చిందని ప్రశ్నించారు. వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకునేది ఉంటే ప్రభుత్వం తరుపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేనేత, టెక్స్‌టైల్, అనుబంధ రంగాలను ఆదుకుంటామని 365 రోజుల పనికల్పిస్తామని ఆసాములు, కార్మికులకు హామీ ఇవ్వాలని, లేదంటే రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగమేఘాల మీద మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్ సిరిసిల్లకు వచ్చి మాట్లాడి శవరాజకీయాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకుంటామని, బకాయిలను చెల్లిస్తామని, విద్యుత్ బకాయిలను రద్దు చేస్తామని ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఆదరబాదరగా సిరిసిల్లలో విలేకరుల సమావేశం పెట్టినంత మాత్రాన ఆసాములకు, కార్మికులకు మేలు చేసినట్టు కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవాలని కల్లబొల్లి కబుర్లు చెప్పి పోయారని ఆరోపించారు. సాంకేతిక రూపంలో ఆర్డర్ల రూపంలో విధివిధానాలతో ప్రభుత్వం జీవోను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిసిల్లకు వచ్చినప్పుడు వస్త్ర పరిశ్రమ వ్యాపారులు, ఆసాములతో మాట్లాడి ధైర్యం ఇచ్చారన్నారు. కార్మికుల పక్షాణ పోరాడుతామని ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ హెచ్చరిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లకు ఆదరబాదరగా వచ్చాడని అన్నారు. కార్మికులకు ఆర్డర్లు ఇవ్వాలని వారి కుటుంబాలు వీధిన పడకుండా ప్రభుత్వం నిలబెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్

- పర్యవేక్షించిన డీఈవో

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌లోని కేంద్రీయ విద్యాయంలో బుధవారం జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 112 ఉన్నత పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న వారినుంచి 15మంది చొప్పున బాలికలు, బాలురలను ఎంపిక చేసి వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో ఒక్కొక్కరిని ఎంపిక చేసి గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో జరిగే ప్రేరణ శిక్షణ కోసం పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను పర్యవేక్షిస్తున్న డీఈవో

తేనెటీగల దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో బుధవారం తేనెటీగలు దాడి చేయడంతో రైతు చల్ల రాములు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన రైతు మామిడి చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్క రైతులు అస్వస్థతకు గురైన రైతు రాములును మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మంత్రిని కలిసిన మాజీ సర్పంచ్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తాను కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నానని మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మర్యాదపూర్వకంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపానని వివరించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

- శుభ్రం చేసి, తేమ శాతం సరిగా ఉండేలా చూసుకోవాలి - అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 10: రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఒక ప్రకటనలో సూచించారు. దళారులను అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు ఈసారి ముందుగానే ఏప్రిల్ ఒకటో తేదీన జిల్లాలో పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో మొత్తం 259 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు 2,203 రూపాలయు, గ్రేడ్ బీ రకానికి 2,183 రూపాయలు నిర్ణయించిదని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని తెలిపారు. జిల్లాలో బుధవారం వరకు మొత్తం 78 మంది రైతుల నుంచి 1.23 కోట్ల విలువైనతి ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం విక్రయించి, ఆన్‌లైన్ అయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రెండు, మూడు రోజుల్లో డబ్బులు జమ అవుతాయని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వెల్లడించారు. జిల్లాలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాలు ముందుగానే ఏర్పాటు చేయడం పై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామంలో బుధవారం కోనరావుపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించే తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో కేశవులు, రైతులు వంగపల్లి దేవరాజు, కాసర్ల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న తంగళ్లపల్లి, ముస్తాబాద్ ఎంపీడీవోలు రాజు, భాస్కరశర్మ

తంగళ్ళపల్లి, ఏప్రిల్ 10: నిర్దేశించిన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో జోగం రాజు ఆదేశించారు. బుధవారం తంగళ్ళపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పథకంపై గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 30 పాఠశాలలను రెండో విడతలో అమ్మ ఆదర్శ పథకం కింద గుర్తించినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాల పనులు మే 31వ తేదీలోపు వంద శాతం పూర్తి చేయించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా ప్రతి పాఠశాలలో మంచినీటి సౌకర్యం, వ్యక్తిగ త మరుగుదొడ్లు, పాఠశాలల మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలో పనులన్నీ పూర్తి చేయించాలని సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘం అధ్యక్షురాలు, స్కూల్ కమిటీ చైర్మన్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, అమ్మ ఆదర్శ పథకం మండల నోడల్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ఇకపై అమల్లో ఉంటుందని విద్యార్థుల ప్రగతికి ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ మండల పరిషత్ అధికారి భాస్కర్‌శర్మ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అమ్మఆదర్శ పాఠశాలల అభివృద్ధిపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో భాస్కర్‌శర్మ మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించి గతంలో పంపితిణీ ప్రతిపాదనల్లో రిపేర్, ఎలక్ట్రిసిటీ పనులు, పారిశుధ్యం, ఇతర అత్యవసర పనులు మాత్రమే చేయాలన్నారు. అలాగే సమావేశాలు, ప్రారంభోత్సవాలు చేయవద్దన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులైన ఏఈ, హెచ్‌ఎం, గ్రామైక్య అధ్యక్షులు ఆధ్వర్యంలో పాఠశాలలో పనులు గుర్తించాలన్నారు. ముఖ్యంగా నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, టాయ్‌లెట్ల నిర్మాణం, పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, క్లస్టర్ హెచ్‌ఎం రాధకిషన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంఈవో అసిస్టెంట్ మల్లారపు శ్రీకాంత్‌రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు సేకరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు సేకరించాలని నిర్ణయించామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారి వద్ద నుంచి విరాళాలు సమకూర్చాలని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలు, వ్యాపార యజమానుల ద్వారా సేకరించాలని నిర్ణయించారు. రూ.10 వేలు విరాళం అందించే వారి పేర్లను శిలాఫలకంపై రాయించి గోడకు వేయాలని పేర్కొన్నారు. వేణుగోపాలస్వామి రథోత్సవం రోజున నిర్వహించే లడ్డు, కొబ్బరికాయ వేలం డబ్బులు వెంటనే చెల్లించి కమిటీకి సహకరించాలని అన్నారు. అర్చకుడు నవీన్‌చారి, సభ్యులు వెంకటేశ్, బాల్‌రెడ్డి, నర్సయ్య, సంతోష్, బాలరాజుయాదవ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్, రామాచారి, కిష్టయ్య, శంకర్, బ్రహ్మచారి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో బంగారు మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా బుధవారం జరిగింది. ఆలయ పునర్‌నిర్మాణంలో భాగంగా చేపట్టిన మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు బుధవారం వార్డు ప్రజలు బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేద మంత్రోచ్చరణాల మధ్య పూజారులు నిర్వహించారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించా రు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్, బీఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల మురళి, దార్ల సందీప్ పాల్గొన్నారు.

ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ప్రజలు ఈర్ష్యాద్వేషాలను విడనాడి ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుని ప్రశాంత జీవనాన్ని సాగించాలని స్వయంభూ ఆదిపరబ్రహ్మ జైమహావిభోశ్రీ అన్నారు. ఉగాది పర్వాదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఓమౌజయాః ప్రజ్ఞాన క్షేత్రంలో బుధవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంభూ ఆదిపరబ్రహ్మ జైమహావిభోశ్రీ ప్రబోధనలు చేశారు. భక్తిభావం పెంపొందినప్పుడే ప్రజలు సన్మార్గంలో పయనిస్తారని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ రాధారపు సత్యం తన తల్లిదండ్రులు లక్ష్మీ-రాజయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని స్థానిక సభ్యులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామచంద్రం, మల్లారెడ్డి, ముత్యంరెడ్డి, లింగారెడ్డి, సాంబశివరావు, అమరేందర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో కేసిరెడ్డి రాజవ్వ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, కోడగంటి శ్యామ్, బోడిగె అనిల్ పాల్గొన్నారు.

పశువుల తొట్టిని నిర్మించాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 10: గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెం కాలనీలో కూలిపోయిన స్థలంలోనే తిరిగి పశువుల తొట్టిని నిర్మించాలని కాలనీ వాసులు బుధవారం నిరసన చేపట్టారు. పశువుల తొట్టి కూలిపోవడంతో పశువులకు ఇబ్బంది ఏర్పడుతోందని వాపోయారు. పశువుల తొట్టి కూలి పోయిన స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి, కూలిపోయిన పశువుల తొట్టి స్థలం కబ్జా కాకుండా చూడాలని, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు తిరిగి పశువుల తొట్టిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, మండల అధ్యక్షుడు లక్కం బాబు, నాయకులు జీవన్, కార్తీక్, రామచంద్రం, అజయ్ ఉన్నారు.

పుట్టల మల్లన్న స్వామిని దర్శించుకున్న నాగం కుమార్

కోనరావుపేట, ఏప్రిల్ 10: మండలం బావుసాయిపేట గ్రామంలోని పుట్టల మల్లన్న కల్యాణ మహోత్సవంలో చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్ బుధవారం పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఆయన వెంట కోనరావుపేట కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బొర్ర రవీందర్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, ఏప్రిల్ 10: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కొడిమ్యాల శ్రీనివాస్ తల్లి రామవ్వ మృతి చెందగా ఆ కుటుంబాన్ని బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వేణుసాగర్, అమృతరావు, ప్రేమ్‌చంద్, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: విద్యార్థులో మానసిక ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో బుధవారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో అయన మాట్లాడారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో అప్రమత్తమైన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల సంఖ్యను రెండు నుంచి నాలుగుకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. గురుకుల ఉపాధ్యాయులను రాత్రి కాపలాదారుల స్థాయికి దిగజార్చడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలకు వారిపై పెరిగిన మానసిక ఒత్తిడే కారణమన్నారు. అ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా వింత ఉత్తర్వులు ఇవ్వటం సమంజసం కాదన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు మానసిక నిపుణులతో కూడిన అధ్యయన కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు పెంచుతామని చెప్పి రెండెళ్లు గడిచిన జీవోలను ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులపై ఇప్పటికే బోధనేతర పనుల భారం అధికంగా ఉందని ఇప్పడు రాత్రి డ్యూటీలో ఉండే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా వారిపై ఒత్తిడి మరింత పెరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి రవీందర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 10: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా పట్టుదలతో సానుకూల దృక్పథంతో ప్రయత్నిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్ర చారి విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాయోనారా పేరుతో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలకు వారు ముఖ్యఅతిథిలుగా హాజరై జ్యోతిప్రజ్వాలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే ఆపకుండా పీజీ కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు చదివి అత్యున్నత స్థాయిలో స్థిరపడాలని ప్రోత్సహించారు. పటిష్ట ప్రణాళిక, పట్టుదల నిరంతర కృషి సానుకూల దృక్పథంతో జీవితంలో ఏదైనా సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు డిగ్రీ అర్హత సరిపోతుందని, ఆదేవిధంగా ఉన్నత స్థాయి చదువులను కొనసాగించి అత్యున్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్రతీఒక్కరు ప్రయత్నించాలని కోరారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో నైపుణ్యం పరిజ్ఞానం కలిగిన డిగ్రీ విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయని వాటికి అనుగుణంగా విద్యార్థులు ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులు నలుగురికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి తమ వంతు కృషి చేయాలని వారు సూచించారు. విద్య విద్యార్థుల జీవితంలో వెలుగు నింపుతుందని తెలిపారు. అంతకుముందు కళాశాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు, పాటు, స్కిట్స్ ర్యాంప్‌వాక్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ సమన్వయకర్త మధు రాజేష్, అధ్యాపకులు, మల్లారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజేష్, ప్రభాకర్, శ్రీనివాస్‌లు, కరుణ, నారాయణ, మధుబాబు, దీపిక, అర్జున్ తదితరులు ఉన్నారు.